

నేడు ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతి ప్రవేశ పరీక్ష

కలెక్టరేట్, ఏప్రిల్ 20: ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతి ప్రవేశానికి అర్హత పరీక్ష ఆదివారం జరగనున్నది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈవో ప్రేమ కుమార్ తెలిపారు. 13 ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు 14 కేంద్రాల్లో 3,669 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఉదయం 10 నుంచి 12 గంటలు వరకు పరీక్ష జరుగుతుంది.

సీఎం మాట.. నీటి మూట



● 'సీఎం ఇచ్చిన మాటకే కట్టుబడకపోతే ఎలా? గుర్ల మినీ రిజర్వాయర్ పూర్తికి సీఎం జగన్ ఇచ్చిన హామీ ఇచ్చారు. అయితే అది ఉత్తుత్తిదేని గ్రహించలేక మోసపోయాం. ఉప ముఖ్యమంత్రి రాజన్నదొరను అడిగితే హామీ ఇచ్చినట్లు ఆధారం చూపించండని అంటున్నారు. వైసీపీ పాలకులు వందలాది మంది రైతులను నమ్మించి వంచించారు. ఇప్పుడు ఎన్నికలు దగ్గర పడుతున్నాయి. మళ్లీ అవే హామీలతో రైతులను మభ్యపెట్టాలని చూస్తున్నారు. రైతులు ఉసురు ప్రభుత్వానికి తగలక మానదు'

- మెంటాడ మండలం గుర్ల గ్రామం గొర్లె సన్యాసిరావు అనే రైతు ఆవేదన ఇది.



● 'రైతుభరోసా కేంద్రం ప్రారంభం సందర్భంగా ముఖ్యమంత్రి ఇక్కడికి వచ్చారు. ఆయన దృష్టికి గుర్లగెడ్డ రిజర్వాయర్ నిర్మాణం పూర్తి కాకపోవడం వల్ల రైతులు పడుతున్న ఇబ్బందులను తీసుకెళ్లాను. దీనికి సీఎం స్పందించారు. గుర్లగెడ్డ రిజర్వాయర్ పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర కూడా ముఖ్యమంత్రికి లేఖ రాశారు. నాలుగేళ్ల గడిచిపోయినా సీఎం జగన్ రైతులు ఇచ్చిన హామీ మాత్రం నేరవేరలేదు. దీనివల్ల రైతుల ఇబ్బందులు తీరలేదు'

-గుర్ల మండలం తమ్మిరాజుపేటకు చెందిన చింతాడ అప్పల నరసమ్మ ఆవేదన ఇది.



రిజర్వాయర్ లోపలి భాగం..



- గుర్ల మినీ రిజర్వాయర్ పూర్తికి జగన్ హామీ
- నాలుగేళ్లుగా అంగుళం కూడా కదలని వైనం
- ఉత్తుత్తి హామీతో రైతులకు బురిడీ
- మూడు వేల ఎకరాల్లో పంట ప్రశ్నార్థకం
- డిప్యూటీ సీఎం ఇచ్చిన హామీలకూ దిక్కులేదు
- చంపావతి నదిపై వంతెనల నిర్మాణం ఏదీ?
- శీలవలస గిరిజనులకు తాగునీరు ఏదీ?
- అంద్ర సొసైటీ హామీ గాలికొదిలేసిన వైనం
- అవన్నీ మరిచి మళ్లీ ఓట్ల కోసం గ్రామాలకు..
- గత హామీలపై నిలదీస్తామంటున్న ప్రజలు

మూడువేల ఎకరాలను సస్యశ్యామలం చేసే గుర్ల రిజర్వాయర్ పూర్తిచేస్తే వందలాది మంది రైతుల జీవితాలు బాగుపడతాయి. తాగు, సాగునీటి సమస్య తీరిపోతుంది. సీఎం హామీ ఇచ్చి నాలుగేళ్లు గడిచిపోయాయి. పనులు అంగుళం కూడా ముందుకు సాగలేదు. ఇదేమని అడిగితే సీఎం హామీ ఇచ్చినట్లు ఆధారాలు చూపించండని డిప్యూటీ సీఎం చెబుతున్నారు. ప్రభుత్వానికి రైతులు ఆధారాలు తెచ్చి చూపించాలా? ఇదేనా రైతు ప్రభుత్వం అంటే..?

మెంటాడ, ఏప్రిల్ 20

మెంటాడలో ప్రధాన సమస్యలపై ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలకే దిక్కు లేకుండా పోయింది. దీంతో ప్రభుత్వంపై రైతులు, ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పెద్దల మాటకే లెకాన లేకపోతే ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నిస్తున్నారు. తమ వద్దకు మళ్లీ ఏముఖం పెట్టుకుని వస్తారో చూస్తామని హెచ్చరిస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్ నాలుగేళ్ల క్రితం రాష్ట్ర వ్యాప్తంగా రైతుభరోసా కేంద్రాలను మెంటాడ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలో సుమారు మూడు వేల ఎకరాల అయకట్టుకు సాగు నీటి వనరు అయిన గుర్ల మినీ రిజర్వాయర్‌ను పూర్తిచేసే బాధ్యత తనదని గొప్పగా ప్రకటించారు. దీంతో అక్కడున్న నాయకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఇక తమ కష్టాలు తీరి నట్లేనని వందలాది మంది రైతులు ఆశించారు. అయితే ఆ పనుల్లో నేటికీ పురోగతి లేదు. ఫలితంగా ప్రతి ఏటా అయకట్టు నీరందక సాగు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. రైతులు ఏటేటా నష్టపోతున్నారు. 1996లో నాటి ప్రభుత్వ హయాంలో ఈ రిజర్వాయర్ మంజూరైంది. తొలిరోజుల్లో పనులు చురుగ్గా జరిగినా ఆ తర్వాత పడకేశాయి. 60 శాతం మేర పనులు పూర్తయ్యాయి. నిధులు కొరత వెంటాడడంతో మోక్షానికి నోచుకోలేదు. స్థానిక శాసన సభ్యుడు, ప్రస్తుత ఉప ముఖ్యంత్రి పీడిక రాజన్నదొర దృష్టికి రైతులు ఎన్నిసార్లు తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. రకరకాల సాకులతో కాలయాపన చేస్తూ వచ్చారు. మూడేళ్ల క్రితం ముఖ్యమంత్రి హామీ ఇచ్చినా అదీ నెరవేరలేదు. దీంతో తమ పట్ల ఇంత నిర్దయ ఎందుకని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఓట్ల కోసం వైసీపీ ప్రజాప్రతినిధులు ఎలా వస్తారో చూస్తామని స్పష్టం చేస్తున్నారు.



వాగు నీటిని పట్టుకుంటున్న గిరిజనులు



కాలువలు ఇలా..

తాగునీరు ఇవ్వరు.. రహదారీ నిర్మించరు

కొండలింగాలవలస పంచాయతీ శీలవలస గ్రామ గిరిజనులు పడుతున్న ఇక్కట్లు అన్నీఇన్నీ కావు. వాగునీరే వారికి అధారం. వేసవిలో నది ఎండితే చెలమల నీరే దిక్కు. ఫలితంగా అంటు వ్యాధులు ముసురుకుని వారి అవస్థలు వర్ణనాతీతం. రహదారి సౌకర్యం లేక అత్యవసర పరిస్థితుల్లో పడుతున్న బాధలు హృదయ విదారకంగా ఉంటున్నాయి. ఎవరైనా చనిపోతే మృతదేహాలను భుజాలపై మోసుకెళ్లిన ఘటనలు ఉన్నాయి. ఈ ఇక్కట్లన్నీ గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామానికి వచ్చిన ఉప ముఖ్యమంత్రి రాజన్నదొరతో ఆ గ్రామ గిరిజనులు మొరపెట్టుకున్నారు. వెనువెంటనే తాగునీటి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రహదారి నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అయితే నేటికీ ఆ సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. ఉప ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలకే ఆతీగతీ లేకపోతే ఎలా అని ఆ గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.



గుర్ల మినీ రిజర్వాయర్

అంద్ర సొసైటీ ఏదీ సారూ..?

అంద్ర రిజర్వాయర్ నిర్వాసితులకు సొసైటీ ఏర్పాటు చేసి పూర్తి న్యాయం చేస్తామని వైసీపీ నేతలు చెప్పుకొచ్చారు. రిజర్వాయర్‌లో మత్స్య సంపదపై నిర్వాసితులకు, పంచాయతీ పాలక వర్గానికి నడుమ అప్పట్లో అనేక గొడవలు జరిగాయి. రిజర్వాయర్ వద్ద పోలీసు పికెట్ కూడా ఏర్పాటు చేశారు. అంద్ర సొసైటీ ఏర్పాటు చేసి గిరిజన నిర్వాసితులకు న్యాయం చేస్తామని హామీ గుప్పించారు. చివరకు రిజర్వాయర్ నిర్వహణ గాలికి వదిలేసారు. సొసైటీ హామీ రిజర్వాయర్‌లో కలిపేశారు. ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నెన్నో ఉత్తుత్తి హామీలు. ఒక్కదానికీ దిక్కు దివానం లేదు. మళ్లీ అవే హామీలతో వైసీపీ నేతలు ముందుకొస్తున్నారు. దీనిపై ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు.

ఓట్ల కోసం వస్తే బుద్ధి చెబుతాం..

శీలవలస గ్రామంలో మౌలిక సదుపాయాలు లేవు. ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర ఇచ్చిన హామీలకు దిక్కు దివానం లేదు. మా బాధలు వారికి పట్టవు. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచినా మా సమస్యలు పట్టించుకోవడం లేదు. మళ్లీ ఏ ముఖం పెట్టుకుని ఓట్ల కోసం వస్తారో చూస్తాం.

- రాజు, శీలవలస గిరిజనుడు

వంతెనలూ కట్టలేకపోయారు..

జగన్నాథపురం నది వద్ద మేము పడిన కష్టాలు ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర కళ్లారా చూశారు. అక్కడ నదిపై బ్రిడ్జిని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. నిర్మాణం అతీగతీ లేదు. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకునే వారే లేరు. హామీలు పట్టించుకోని వారు ఓట్ల కోసం ఎలా వస్తారు?

- జి.కిరణ్

సొసైటీ అంటూ ఊరించారు..

అంద్ర రిజర్వాయర్ నిర్వాసితులకు సొసైటీ ఏర్పాటు చేస్తామని డిప్యూటీ సీఎం రాజన్నదొర హామీ ఇచ్చారు. ఇప్పుడు దాన్ని రిజర్వాయర్‌లో కలిపేశారు. ఒక సొసైటీ ఏర్పాటు చేయడానికి ఆయనకు ఇన్నేళ్ల పదవీకాలం సరిపోలేదా? ఇది చాలా అన్యాయం. గిరిజనులంటే ఇంత చిన్నచూపా?

- రాకోటి రాములు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు



వంతెన లేక గర్భిణిని నది ఆవలి వైపునకు నడిపించుకుంటూ వెళ్తున్న గ్రామస్థులు (ఫైల్)

వంతెనల హామీలూ హుళక్కే.

జగనాథపురం, అగూరు గ్రామాల వద్ద చంపావతి నదిపై వంతెనల నిర్మాణం ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర హామీ ఇవ్వని వేదిక లేదంటే అతిశయోక్తి కాదు. వైసీపీ పాలనా కాలం ముగుస్తున్నా బ్రిడ్జి నిర్మాణం లేదు. దీంతో రాజన్నదొర హామీ అటకెక్కింది. నిధుల కొరత అని ఒకసారి, కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని ఇంకోసారి ఆయన పలు రకాల కారణాలతో కాలం గడిపేశారు. భారీ వర్షం వచ్చిందంటే చంపావతి నది ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో పది గ్రామాల ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. అత్యవసర పరిస్థితి అయితే అంతేసంగతులు. ఈ నదిపై బ్రిడ్జిని నిర్మించాలని ఎంతోకాలంగా ఆ రెండు గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అయినా వారి ఘోష వైసీపీ పాలకులకు పట్టలేదు. దీంతో విసిగివేసారిపోయిన జగన్నాథపురం వాసులు నదిపై తాత్కాలిక వంతెన నిర్మించుకున్నారు. వర్షాలకు అదికూడా కొట్టుకుని పోయింది. గ్రామంలో ఎవరికైనా జబ్బు చేస్తే 108 అంబులెన్స్ కాదుకదా.. ఆటో కూడా వచ్చే పరిస్థితి కూడా లేదు. అత్యవసరమైతే కొట్టుకుపోయిన వంతెనపై నడిపించుకుంటూ వచ్చి వాహనంలో వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

చంద్రబాబు పర్యటనలో స్వల్ప మార్పు

● ఈనెల 24న జిల్లాకు రానున్న బాబు.. పవన్



విజయనగరం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన పార్టీ అధినేతల జిల్లా పర్యటనలో స్వల్ప మార్పు జరిగింది. ముందుగా అనుకున్న ప్రకారం ఈనెల 23న వారు రావాల్సి ఉంది. అదే రోజున పిఠాపురంలో పవన్ కళ్యాణ్ నామినేషన్ పత్రాలు దాఖలు చేయనున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఈనెల 24న ప్రజాగళం కార్యక్రమంలో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబుతో కలిసి పవన్ కళ్యాణ్ జిల్లాకు రానున్నారు. నెల్లిమర్ల నియోజకవర్గ కేంద్రంలోని రామతీర్థం కూడలిలో ప్రజల నుద్దేశించి ప్రసంగిస్తారు. తరువాత సాయంత్రం విజయగనరం అంబేడ్కరి కూడలికి చేరుకుని ప్రసంగిస్తారు. ఇదిలా ఉండగా ఈనెల 22న ఎస్.కోట నియోజకవర్గంలో చంద్రబాబు పర్యటిస్తారు. ప్రజల నుద్దేశించి ప్రసంగిస్తారు.

మూడో రోజున 14 నామినేషన్లు

● లోక్‌సభ స్థానానికి నిల్

విజయనగరం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడో రోజున శనివారం 14 నామినేషన్లు మాత్రమే దాఖలయ్యాయి. విజయగనరం అసెంబ్లీకి 8 నామినేషను వచ్చాయి. ఇందులో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. కోలగట్ల వెంకటరమణి మూడు సెట్ల పత్రాలు వేశారు. యుగతులసీ పార్టీ నుంచి ఒక నామినేషన్ వేశారు. చీపురుపల్లిలో మంత్రి బొత్స సత్యనారాయణ మరో సెట్టు నామినేషన్‌ను వేశారు. ఈయన కుమారుడు బొత్స సందీప్ రెండు సెట్లు వేశారు. నెల్లిమర్లలలో స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ వేశారు. బొబ్బిలిలో కాంగ్రెస్ అభ్యర్థి, స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ వేశారు. గజపతినగరం, ఎస్.కోట, రాజాం నియోజకవర్గాల్లో నామినేషన్లు పడలేదు. విజయనగరం లోక్‌సభ స్థానానికి కూడా నామినేషన్ పడలేదు.

ఈనెల 27న పాలిసెట్

కలెక్టరేట్, ఏప్రిల్ 20: ఈనెల 27న జరిగే పాలిటెక్నికల్ ఎంట్రన్స్ టెస్టు (పాలిసెట్)కు ఏర్పాట్లు పక్కాగా చేయాలని డీఆర్వో ఎస్‌డీ అనిత ఆదేశించారు. పాలిసెట్ నిర్వహణపై తన చాంబర్‌లో శనివారం సమీక్ష నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ పరీక్షకు 8,864 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా 24 కేంద్రాల్లో ఈ పరీక్ష జరుగుతుందన్నారు. విజయనగరంలో 11, గజపతినగరంలో 6, బొబ్బిలిలో 7 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ పరీక్ష జరుగుతుందని, అభ్యర్థులు గంట ముందే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. 11 తర్వాత ఒక్క నిమషం దాటినా లోప లికి అనుమతించేదిలేదని తెలిపారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. పాలి సెట్‌కు సంబంధించి ఇతర వివరాలకు 7989781520 నెంబరును సంప్రదించాలని కోరారు. సమీక్షలో పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్ ఆషారాణి, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ తిరుమల రావు, విద్య, విద్యుత్, వైద్య ఆరోగ్య, పోలీసు, రెవెన్యూ తదితర శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక లావాదేవీలపై నిఘా ఉంచాలి

● బ్యాంకు డిపాజిట్లపై దృష్టి సారించాలి ● రాష్ట్ర వ్యయ పరిశీలకులు నీనా నిగం



మాట్లాడుతున్న వ్యయ పరిశీలకులు నీనా నిగం

కలెక్టరేట్, ఏప్రిల్ 20: ఆర్థిక లావాదేవీలు, ఖర్చులు, ఇతర వ్యయాలపై పటిష్ఠ నిఘా ఉంచాలని రాష్ట్ర వ్యయ పరిశీలకులు నీనా నిగం ఆదేశించారు. కలెక్టరు నాగలక్ష్మి, ఎస్పీ దీపిక, ఇతర అధికారులతో కలిసి ఆమె శనివారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల మేరకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలన్నారు. నగదు బట్వాడా, బహుమతులు, ఇతర వస్తువులు తరలింపు, మద్యం రవాణా తదితర వాటిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. కలెక్టరు మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రత్యేక గ్రీవెన్స్ కమిటీ ద్వారా సాధారణ పౌరుల నుంచి జప్తు చేసిన నగదును ఆధారాలను పరిశీలించి త్వరిగతిన వెనక్కి ఇచ్చేయాలని సూచించారు. సమీక్షలో జేసీ కార్తీక్, సహాయ కలెక్టరు వెంకట్ త్రివినాగ్, అదనపు ఎస్పీ అస్మ ఫరీన్, డీఆర్వో అనిత తదితరులు పాల్గొన్నారు.

సిద్ధం సభ ఉందా?.. హడల్

● రెండోరోజూ ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు
● జిల్లా నుంచి 60 ఆర్టీసీ బస్సుల తరలింపు



విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో టికెట్ల కోసం క్యూ



బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు



బస్సు రాగానే ఎక్కేందుకు పాట్లు

విజయనగరం(ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 20: అనకాపల్లి జిల్లాలో జరిగిన జగన్ సిద్ధం సభకు జిల్లా నుంచి ఆర్టీసీ బస్సులు తరలించారు. దీంతో రెండోరోజు కూడా ప్రయాణికులు ఇక్కట్లు పడ్డారు. 19వ తేదీన తూర్పుగోదావరి జిల్లాలో సిద్ధం సభ జరిగింది. ఇందుకోసం 18వ తేదీన జిల్లా నుంచి 45 బస్సులు పంపించారు. అలాగే 20వ తేదీన అనకాపల్లి జిల్లాలో సిద్ధం సభ నిర్వహించారు. ఇందుకోసం రెండో రోజుకూడా జిల్లా నుంచి 60 బస్సులు పంపించారు. దీంతో వరుసగా రెండురోజుల పాటు ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. బస్సుల కోసం బస్ స్టాండ్‌లో ఎదురుచూస్తూ.. ఎండతీవ్రత, ఉక్కబోత, వడగాల్పులతో చిన్నారులు, వృద్ధులు, మహిళలు పడిన బాధలు వర్ణనాతీతం. శుభకార్యాలకు మరో మూడు రోజులు మాత్రమే ముహూర్తాలు ఉండటంతో జిల్లాలో ముమ్మరంగా వివాహాలు, గృహప్రవేశాలు జరుగుతున్నాయి. ఇందుకోసం గ్రామాలకు, సుదూర ప్రాంతాలకు వెళ్లే వారు తగినన్ని బస్సుల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు వాహనాల్లో వెళ్లాలంటే అధిక మొత్తంలో డబ్బులు అడుగుతున్నారని, బస్టాండ్‌కు వస్తే ఆర్టీసీ బస్సులు లేవని, సమయానికి గమ్యస్థానాన్ని చేరుకోలేక అగచాట్లు పడుతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేడు కూడా ఇదే పరిస్థితి..?

విశాఖ జిల్లాలో ఆదివారం జగన్ సిద్ధం సభ ఉండటంతో ఆరోజు కూడా ప్రయాణ ఇక్కట్లు తప్పవని జిల్లా వాసులు ఆందోళన చెందుతున్నారు. ఎక్కడ జగన్ సభలు జరిగినా జిల్లానుంచి పదుల సంఖ్యలో బస్సులు తరలిస్తున్నారు. దీంతో ప్రయాణికులకు పాట్లు తప్పటం లేదు.

అధికార పార్టీ నాయకుల హామీలకు అడ్డూఅదుపు లేకుండాపోయింది. అంతన్నారు.. ఇంతన్నారు అన్న చందంగా రాజాం నియోజకవర్గ ఓటర్లను ఆకట్టుకునేందుకు ఎన్నికల ముందు ఎన్నెన్నో హామీలు గుప్పించారు. తీరా అధికారంలోకి వచ్చాక పట్టించుకున్న పాపాన పోలేదు. ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా సక్రమంగా అమలు కాలేదని నియోజకవర్గ ప్రజలు వాపోతున్నారు. ఇప్పుడు మళ్లీ ఎన్నికలకు సిద్ధమవుతుండడంతో గతంలో వైసీపీ నాయకులు ఇచ్చిన హామీలను తలచుకుంటున్నారు.

హామీలు బోలెడు.. ఆచరణ జానెడు!

- గత ఎన్నికల ముందు భ్రమలు
- ఓటర్లను ఆకర్షించేందుకు రకరకాల వాగ్దానాలు
- అధికారంలోకి వచ్చాక పట్టించుకోని వైనం
- వైసీపీ నాయకుల హామీలన్నీ బుట్టదాఖలు
- నిరాశలో రాజాం నియోజకవర్గ ప్రజలు



చెరువును తలపిస్తున్న రాజాం పట్టణ ప్రధాన రహదారి (ఫైల్)



(రాజాం)

అధికార వైసీపీ నాయకుల హామీలు నీటిమూట లేనని తేటతెల్లమైంది. తమవన్నీ మాటల వరకే గాని ఆచరణలో ఉండవంటూ నిరూపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో రాజాం నియోజకవర్గ ప్రజలు మండిపడుతున్నారు. విజయనగరం జిల్లా రాజాం నుంచి శ్రీకాకుళం జిల్లా సంతకవిటిని కలుపుతూ 16 కిలోమీటర్ల రహదారి నిర్మాణం చేపడతామని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. రెండేళ్ల కిందట రూ.50 కోట్లు మంజూరు చేసినట్టు ప్రకటించారు. కానీ పనులు మాత్రం ప్రారంభించలేదు. అటు శ్రీకాకుళం జిల్లా పొందూరు రోడ్డును కలుపుతూ ఉన్న ఈ రహదారిపై నిత్య మూ వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. కానీ వైసీపీ ప్రభుత్వం రోడ్డు నిర్మాణానికి మొగ్గు చూపలేదు. రాజాం మునిసిపాల్టీ పరిధిలో రహదారుల నిర్మాణానికి ఏడాది కిందట ప్ర భుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసింది. గుంటూరుకు చెం దిన ఓ కంపెనీ కాంట్రాక్టు పనులను దక్కించుకుంది. సుమా రు రూ.6 కోట్ల మేర పనులు పూర్తిచేసింది. కానీ ఒక్క రూ పాయి కూడా బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో ఈ హామీ సైతం బుట్టదాఖలైంది. ఇవొక్కటే కాదు.. రాజాం నియోజకవర్గానికి ఇచ్చిన హామీలేవీ పూర్తిస్థాయిలో నెరవేరలేదు. ఆ దిశగా ప్రయత్నాలు కూడా జరగలేదు. రెండేళ్ల కిందట బొబ్బిలి రోడ్డు నుంచి గాయత్రీనగర్ వరకూ.. అంబేడ్కర్ జంక్షన్ నుంచి జీఎంఆర్ ఐటీ వరకూ రహదారి విస్తరణ, కాలువల నిర్మాణానికి ప్రభుత్వం రూ20 కోట్లు మంజూరు చేసింది. దీంతో పట్టణ స్వరూపమే మారిపోతుందని వైసీపీ నేతలు, ప్రజాప్రతినిధులు ఆర్భాటంగా ప్రకటించారు. టెండరు దక్కించుకున్న పృథ్వీ అనే సంస్థ పనులను ప్రారంభించింది. గత నవంబరు వరకూ సుమారు రూ.6 కోట్లతో పనులు చేపట్టింది. బిల్లుల చెల్లింపులో ప్రభుత్వం మొండిచేయి చూపింది. దీంతో కాంట్రాక్టర్ పనులు చేయలేనని చేతులెత్తేశారు. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచి పోయాయి. కనీసం ఎందుకు పనులు నిలిపివేశారో అడిగే నాథుడు లేకపోయాడు. ఫలితంగా రాజాం నియోజకవర్గ ప్రజలకు కష్టాలు తప్పడం లేదు.

మునిసిపాలిటీ రోడ్లు అధ్వానం

రాజాం మునిసిపాలిటీలో రహదారుల పరిస్థితిని ఎలా వర్ణించినా తక్కువే అవుతుంది. ముఖ్యంగా అంబేడ్కర్ జంక్షన్ నుంచి జీఎంఆర్ ఐటీ వరకూ రోడ్డులో ప్రయాణమంటే హడలెత్తిపోవాల్సిందే. అటువైపుగా వేల మంది రాకపోకలు సాగిస్తుంటారు. వర్షాకాలంలో అయితే ప్రతిరోజూ ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈ రహదారి పరిస్థితిపై స్థానిక ఎమ్మెల్యే కంబాల జోగులును స్థానికులు నిలదీసిన సందర్భాలు కూడా ఉన్నాయి. అయినా సరే పరిస్థితిలో మార్పు రావడం లేదు. నిధులు పుష్కలంగా ఉన్నాయని చెబుతున్నారు. కానీ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడం లేదు. ఈ కారణంతోనే పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు.

నూతన భవనమన్నారు..

దశాబ్ద కాలం కిందట రాజాం మేజర్ పంచాయతీ నుంచి నగర పంచాయతీగా మారింది. అక్కడి నుంచి మునిసిపాల్టీగా అవతరించింది. కానీ ఇప్పటివరకూ పాలకవర్గాలు లేవు. ఎన్నికలు జరగలేదు. దీంతో ప్రజాప్రతినిధులు లేరన్న సాకుతోనో.. మరే ఇతర కారణాలో తెలియదు కానీ.. కనీసం మునిసిపల్ కార్యాలయ భవన నిర్మాణానికి కూడా నోచుకోలేదు. గత ఎన్నికల్లో వైసీపీ నూతన భవన నిర్మాణానికి హామీ ఇచ్చింది. కానీ ఐదేళ్లలో కనీసం స్థలం కేటాయింపు, స్థల పరిశీలన కూడా జరగని పరిస్థితి.

నాగావళిపై వంతెన ఎప్పుడో?


సంతకవిటి మండలం బసవలరేవు వద్ద నాగావళి నదిపై వంతెన నిర్మాణం చేపట్టాలని గ్రామానికి చెందిన ప్రజలు ఏడాది పాటు నిరాహార దీక్ష చేపట్టారు. అయితే వైసీపీ ప్రభుత్వం హయాంలో స్పీకర్ తమ్మినేని సీతారాం నిరాహార దీక్ష వద్దకు చేరుకొని వంతెన నిర్మాణం చేడతామని హామీయిచ్చి దీక్షను విరమింపజేశారు. అంతేకాకుండా సీఎం జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో కూడా బసవలరేవు వంతెన నిర్మాణం చేసి తీరుతామని హామీయిచ్చారు. ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు దీంతో ఆయా గ్రామాల ప్రజలు నాగావళి నదిని దాటాలంటే పడవ ప్రయాణం చేయావాల్సిందే.

రాకపోకలకు అవస్థలు

రాజాం నుంచి వంగర వరకూ 20 కిలోమీటర్ల మేర రహదారిని విస్తరిస్తామని గత ఎన్నికల్లో హామీ ఇచ్చారు. జీఎంఆర్ ఐటీ నుంచి పాలకొండ వరకూ రహదారి విస్తరణ చేపడతామని కూడా చెప్పుకొచ్చారు. కానీ ఈ రెండు రహదారుల విషయంలో కనీస పురోగతి లేదు. దీంతో అటు పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇ బ్బంది పడుతున్నారు. పాలకొండ రహదారిలో అయితే నిత్యమూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. మనుషుల ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోంది. కనీసం ప్రతిపాదనలు కూడా పంపలేదని అధికార వర్గాలు చెబుతున్నాయి.

డిగ్రీ కళాశాల ఒట్టి మాటే..

విద్యాపరంగా సైతం పెద్దగా కేటాయింపులు లేవు. నియోజకవర్గానికి ఒక డిగ్రీ కాలేజీ ప్రతిపాదన సైతం బుట్టదాఖలైంది. దీంతో స్థానిక విద్యార్థులు ప్రైవేటు కాలేజీల్లో చేరాల్సిన పరిస్థితి ఎదురైంది. నియోజకవర్గంలో కొత్తగా జూనియర్ కాలేజీల ఏర్పాటు, పాఠశాలల అప్‌గ్రేడ్ ప్రక్రియ సైతం సక్రమంగా జరగలేదు. గత ఎన్నికల ముందు వైసీపీ ఇచ్చిన హామీల్లో 80 శాతం వరకూ అమలుకు నోచుకోలేదు



'మడ్డువలస' ఊసే లేదు..

మడ్డువలస, తోటపల్లి ప్రధాన కాలువలు ఆధునీకరణ పనులు చేపడాతామని.. ఆయకట్టు రైతులకు పుష్కలంగా సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని రాజాంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారసభలో చేసిన వాగ్దానం బుట్టదాఖలైంది. ఆధునీకరణ పనులు చేపడతారని రైతులు సుమారు ఐదేళ్ల నుంచి ఎదురు చూడటమే తప్ప ఆచరణలో అమలు కావడం లేదు. అందుకు ప్రతి ఏటా సాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు వర్షాలు పడితే తప్ప పంటలు పండే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.



మడ్డువలస ప్రాజెక్ట్ →

పందెం నీదా.. నాదా?

- ఎన్నికల్లో విజయంపై జోరుగా బెట్టింగులు
- భారీగా 'పెట్టుబడి'

విజయనగరం (ఆంధ్రజ్యోతి)

'టీడీపీ అధికారంలోకి వస్తే... నువ్వు పొలం రాసివ్వాలి. వైసీపీ అధికారంలోకి వస్తే నీకు నేను రాసిస్తా... అదనంగా రూ.ఐదు లక్షల క్యాష్'... ఇదీ చీపురుపల్లి నియోజకవర్గంలోని గరివిడి మండలంలోని ఓ గ్రామంలో టీడీపీ అభిమాని... వైసీపీకి చెందిన స్థానిక ప్రజాప్రతినిధుల మధ్య పందెం.

... వచ్చే సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై జనానికి ఉన్న ఆసక్తికి.. తమ పార్టీల గెలుపుపై అభిమానులకు...నాయకులకు ఉన్న విశ్వాసానికి ఈ పందెం ఓ నిదర్శనం. అక్కడే కాదు. ఆ స్థాయిలో కాకపోయినా దాదాపు ప్రతి పల్లెలోనూ ఈ తరహా పందాలు సాగుతున్నాయి. 'మా పార్టీ అధికారంలోకి వస్తుంద'ని ఒకరంటే... 'కాదు మా పార్టీ అధికారంలోకి వచ్చి తీరుతుందని' మరొకరు అంటున్నారు...ఇలా పరస్పరం పందాలు కాసుకుంటున్నారు. దీని కోసం డబ్బుతో పాటు ఆస్తులూ పణంగా పెడుతున్నారు. వివిధ పార్టీల అభ్యర్థుల తరఫున ప్రచారంలో పాల్గొంటున్న నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో వస్తున్న స్పందనను బట్టి ఓ అంచనాకు వస్తున్నారు. జిల్లాలోని 7 నియోజక వర్గాల పరిధిలో అన్ని చోట్లా టీడీపీ- వైసీపీలపై పందెంరాయుళ్లు 'పెట్టుబడి' పెడుతున్నారు. ఇక పట్టణాల్లోనూ ఈ తరహా పందాలు సాగుతున్నాయి.





కాకపోతే అవి కాస్తా 'కార్పొరేట్ స్టైల్‌లో ఉంటున్నాయి. ఓవైపు నామినేషన్ల ప్రక్రియ సాగుతుండడం...అభ్యర్థుల ప్రచార సరళి... వీటన్నిటినీ బేరీజు వేసుకొని పందాలకు దిగుతున్నారు. రూ.వేల నుంచి రూ.లక్షల వరకూ ఈ మొత్తాలు ఉంటున్నాయి. విజయనగరం పార్లమెంటుకు కూటమి తరఫున కలిశెట్టి అప్పలనాయుడు... వైసీపీ తరఫున బెల్లాన చంద్రశేఖర్ పోటీలో ఉన్నారు. వీరిద్దరూ ఒకే సామాజిక వర్గానికి చెందినవారు. దీంతో ఎవరు గెలుస్తారన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. వీరిద్దరిపై కూడా జోరుగా పందాలు సాగుతున్నాయి. ఇక విజయనగరం అసెంబ్లీ స్థానానికి కూటమి అభ్యర్థి అశోక్‌గజపతిరాజు కుమార్తె అదితి గజపతిరాజు... వైసీపీ తరఫున సిట్టింగ్ ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి బరిలో దిగారు. వీరిద్దరిపై కూడా ఎక్కువ మంది బెట్టింగులు కాస్తున్నారు. మున్ముందు ఇవి మరింత జోరందుకునే అవకాశాలు ఉన్నాయి.

అనగనగా.. శివరాంపురం

సెంటిమెంట్

సాలూరు రూరల్: కొత్త పని ప్రారంభించాలన్నా...కొత్త వస్తువు వాడాలన్నా... మంచి ముహూర్తం చూడడమో... తమకు నచ్చిన వారితో చేయించడమో చాలామందికి సెంటిమెంట్. ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఎన్నికల బరిలో ఇదీ మరీ ఎక్కువగా ఉంటుంది. అలాంటిదే సాలూరు నియోజకవర్గంలోనూ నాయకులకు ఓ సెంటిమెంట్ ఉంది. ఏ పార్టీ నేతలైనా శాసనసభ ఎన్నికల్లో తొలుత శివరాంపురం నుంచే ఎన్నికల ప్రచారభేరి మోగించడం పరిపాటి. సాలూరు నియోజకవర్గ ప్రధాన కేంద్రానికి ఈశాన్య మూల శివరాంపురం ఉంది. శివరాంపురంలో ప్రచారానికి వచ్చిన వారు తొలుత కొత్త పోలమ్మ గుడిలో పూజలు చేయడం ఆచారం. అనంతరం శివాలయంలో పూజలు చేసి ప్రచారభేరిని మోగిస్తారు. ఈ గ్రామం నుంచి పార్టీ అభ్యర్థులు ప్రచారం ప్రారంభిస్తే కలిసొస్తుందని నమ్మకం. ప్రస్తుత ఎన్నికల్లో విజయాన్ని కాంక్షిస్తూ గత నెల 16న కూటమి అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి ప్రచారం మొదలు పెట్టారు. తొలుత అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం శివాలయంలోను, నాగదేవతకు పూజలు చేసి ప్రచార ఘట్టానికి తెరతీశారు. వైసీపీ అభ్యర్థి, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర గత నెల 23న శివరాంపురం నుంచే తన ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఏ పార్టీ వారైనా శివరాంపురంలోనే తొలి ఓటరును పలుకరించడం ఆచారంగా వస్తోంది.



శివరాంపురం గ్రామం

రేపు బేబీనాయన నామినేషన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్డీఏ నాయకులు

బొబ్బిలి: బొబ్బిలి అసెంబ్లీ స్థానానికి ఎన్‌డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) ఈ నెల 22న ఉదయం నామినేషన్ దాఖలు చేయనున్నారు. స్థానిక దర్బారు మహల్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. పెద్దలు నిర్ణయించిన ముహూర్తం ప్రకారం సోమవారం ఉదయం 9 నుంచి 10.30 గంటల లోపు ముఖ్య నాయకులతో కలిసి నామినేషన్ పత్రాలను సమర్పిస్తామని చెప్పారు. మధ్యాహ్నం 3.30 గంటల తరువాత బొబ్బిలి పట్టణంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తామని బేబీనాయన తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మరిశర్ల రామారావునాయుడు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి, జనసేన రాష్ట్ర కార్యనిర్వహణా కార్యదర్శి పాలూరు బాబు, టీడీపీ రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి అల్లాడ భాస్కరరావు పాల్గొన్నారు.

సార్లూ.. చూస్తున్నారా?

- ఐదుగురు కాదు.. 30 మంది వెళ్లిన వైనం
- కోలగట్ల నామినేషన్ కార్యక్రమంలో ఇదీతీరు

విజయనగరం క్రైం, ఏప్రిల్ 20: వైసీపీ నాయకులు ఎన్నికల నిబంధనలు గాలికొదిలారు. ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు కూడా పట్టించుకోలేదు. అధికార పార్టీ వారు కావడంతో పోలీసులు కూడా చూసీచూడనట్టు వదిలేశారు. నిబంధనల ప్రకారం విజయనగరం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే ముందు పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. అంతవరకు ఎంతమంది వెళ్లినా.. ఇబ్బంది లేదు. బారికేడ్ దాటే సమయంలో నామినేషన్ వేసే వ్యక్తితోపాటు, ఐదుగురికి మాత్రమే అవకాశం ఉంది. శనివారం విజయనగరం వైసీపీ అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి నామినేషన్ వేశారు. అయితే ఆయనతో పాటు 30 మంది వరకు బారికేడ్లు దాటుకుని లోపలకు వెళ్లిపోయారు. కొంతమంది పోలీసులు చూస్తున్నా.. ఒకరిద్దరు మాత్రం వైసీపీ నేతలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. కానీ వైసీపీ నాయకులు వారిని పట్టించుకోకుండా ముందుకు సాగిపోయారు.



నామినేషన్ వేసేందుకు కోలగట్ల వెంట గుంపుగా వెళ్తున్న వైసీపీ నాయకులు

జన చైతనం
ఆంధ్రజ్యోతి
ఆదివారం 21 ఏప్రిల్ 2024

ఇప్పటి వరకు 15 సార్వత్రిక ఎన్నికలు

మీకు తెలుసా?

విజయనగరం: ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పటి నుంచి ఇప్పటి వరకు 15 సార్లు సార్వత్రిక ఎన్నికలు జరిగాయి.1952 నుంచి 2014 వరకు 14 సార్లు ఎన్నికలు నిర్వహించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1952లో తొలిసారి రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. 1957 ఫిబ్రవరి 25, 1962 ఫిబ్రవరి 19, 1967 ఫిబ్రవరి 8, 1972 మార్చి 15, 1978 ఫిబ్రవరి 25, 1983 మే 1, 1985 మే 3, 1989 నవంబరు 22, 1994 డిసెంబర్ 1, 1999 సెప్టెంబరు 18, 2004 ఏప్రిల్ 20, 2009 ఏప్రిల్ 16, 2014 ఏప్రిల్ 30, 2019 ఏప్రిల్ 11న ఎన్నికలను నిర్వహించారు.

72 ఏళ్ల చరిత్ర.. ఎంతో ఘనత!

విజయనగరం జిల్లాలో ప్రాముఖ్యం కలిగిన నియోజకవర్గాల్లో చీపురుపల్లిది ప్రత్యేక స్థానం. 2009కి ముందు శ్రీకాకుళం జిల్లాలోని కొన్ని మండలాలతో ఉన్న ఈ నియోజకవర్గం... ఆ తరువాత విజయనగరం జిల్లాలోని మండలాలతో కొత్తదనం సంతరించుకుంది. ఎందరో ప్రముఖులను శాసనసభకు పంపించింది.

- ఇదీ చీపురుపల్లి నియోజకవర్గం ప్రత్యేకత
- పాతికేళ్లకు పైగా సైకిల్‌కే ఓటు
- ఎందరో ఉద్దండులకు నిలయం

(చీపురుపల్లి)

జిల్లాలోని చరిత్ర కలిగిన నియోజకవర్గాల్లో చీపురుపల్లి ఒకటి. 1952లో ఈ నియోజకవర్గం ఆవిర్భవించింది. ఇక్కడ తూర్పు కాపు సామాజిక వర్గం అధికంగా ఉంది. ప్రస్తుతం ఈ నియోజకవర్గంలో చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలాలు ఉన్నాయి. నియోజకవర్గాల పునర్విభజనకు ముందు చీపురుపల్లిలో గరివిడి, శ్రీకాకుళం జిల్లాలోని పొందూరు, జి.సిగడాం మండలాలు విలీనమై ఉండేవి. పునర్విభజన అనంతరం సిగడాం, పొందూరు రాజాం, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లోకి చేరగా, అప్పటి దాకా తెర్లాంలో ఉన్న మెరకముడిదాం మండలం, గజపతినగరంలో ఉన్న గుర్ల మండలాలు చీపురుపల్లిలో కలిశాయి. తాజా సమాచారం ప్రకారం ఇక్కడ 2,04,868 మంది ఓటర్లు ఉన్నారు. ఈ నియోజకవర్గానికి రాజకీయంగా ఎంతో చైతన్యవంతమైనదిగా గుర్తింపు ఉంది. గడిచిన 72 సంవత్సరాల్లో ఎంతో మంది ఈ నియోజకవర్గం నుంచి విజయం సాధించి అసెంబ్లీలో అడుగుపెట్టారు. వీరిలో చాలా మందిని మంత్రి లేదా దానికి సమానమైన పదవులు వరించాయి. రాష్ట్ర స్థాయి రాజకీయాల్లో ప్రాధాన్యం ఉన్న వారు పోటీ చేసి గెలవడం వల్ల ఈ నియోజకవర్గానికి ప్రత్యేకమైన గుర్తింపు వచ్చింది. 72 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ నియోజవర్గంలో 1983 వరకూ ఒక రకమైన రాజకీయాలు సాగగా... 1982లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించాక రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారి పోయింది. అప్పటి నుంచి తెలుగు దేశం పార్టీకి కంచుకోటగా మారింది. ఎక్కువ కాలం పాటు తెలుగుదేశం పార్టీ జెండాయే ఇక్కడ రెపరెపలాడింది. ఇప్పటి వరకూ ఈ నియోజకవర్గానికి 11 మంది నాయకులు 14 అసెంబ్లీలకు ప్రాతినిధ్యం వహించగా, వారిలో రెండుసార్లు ఎమ్మెల్యే పదవిని చేజిక్కించుకున్న వారు ఇద్దరే. ఆ అరుదైన రికార్డు గద్దే బాబూరావు, బొత్స సత్యనారాయణలకు మాత్రమే దక్కింది.


తాడ్డె చిన అచ్చెన్నాయుడు


తాడ్డె రామారావు


త్రిపురాన వెంకటరత్నం


కోట్ల సన్యాసప్పల నాయుడు


గద్దే బాబూరావు


బొత్స సత్యనారాయణ


కిమిడి మృణాళిని

1952 నుంచి ఎమ్మెల్యేలుగా..

1952లో జరిగిన తొలి ఎన్నికల్లో తాడ్డె అచ్చెన్నాయుడు గెలుపొందారు. 1957లో ఎం.సత్యనారాయణరాజు, 1962లో కోట్ల సన్యాసప్పలనాయుడు (సోషలిస్టు), 1967లో ఇండిపెండెంట్‌గా తాడ్డె రామారావు, 1972లో కాసు కాంగ్రెస్ తరఫున రౌతు పైడపునాయుడు (పోలినాయుడు) గెలిచారు. 1978లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా చిగిలపల్లి శ్యామలరావు విజయం సాధించారు. అనంతరం తెలుగు దేశం పార్టీ ఆవిర్భవించాక... 1983లో త్రిపురాన వెంకటరత్నం, 1985లో కెంబూరి రామ్మోహనరావులు గెలుపొంది చీపురుపల్లిలో తెలుగుదేశం పార్టీకి గట్టి పునాదులు వేశారు. 1989, 94లో కూడా అదే పార్టీ తరఫున వరుసగా రెండుసార్లు గద్దే బాబూరావు గెలిచారు. 1999, 2004 సంవత్సరాల్లో బొత్స సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీ తరఫున వరుసగా గెలిచారు. తిరిగి 2014లో అనూహ్యంగా చీపురుపల్లి టికెట్ దక్కించుకున్న కిమిడి మృణాళిని బొత్సపై విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో బొత్స సత్యనారాయణ ఈ నియోజకవర్గంలో మూడోసారి గెలుపొందారు.


చీపురుపల్లి నియోజకవర్గ ముఖచిత్రం



చీపురుపల్లి నియోజకవర్గం మ్యాప్

స్వరూపం మారింది

2009 తరువాత నియోజకవర్గాల పునర్విభజన అనంతరం, గుర్ల, మెరకముడిదాం, గరివిడి, చీపురుపల్లి మండలాలతో ఈ నియోజకవర్గం కొత్త రూపును సంతరించుకుంది. అంతకుముందు ఈ నియోజకవర్గంలో విజయనగరం జిల్లాకు చెందిన చీపురుపల్లి, గరివిడి మండలాలతో బాటు అప్పటి శ్రీకాకుళం జిల్లాకు చెందిన జి.సిగడాం, పొందూరు మండలాలు ఉండేవి. అప్పటి వరకూ తెర్లాం నియోజక వర్గంలో ఉన్న మెరకముడిదాం మండలాన్ని చీపురుపల్లి నియోజకవర్గంలో విలీనం చేసి.. జి.సిగడాం, పొందూరు మండలాల ను తిరిగి శ్రీకాకుళం జిల్లాలోని రాజాం, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లో చేర్చారు.

12 మందిలో ఐదుగురు టీడీపీ వారే...

ఇప్పటి వరకూ ఈ నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించిన నాయకులు 11 మంది కాగా.. వారిలో ఐదుగురు తెలుగుదేశం పార్టీకి చెందిన వారే. 1983లో దివంగత ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ స్థాపించాక.. మొదటి సారిగా ఆ పార్టీ తరఫున త్రిపురాన వెంకటరత్నం విజయబావుటా ఎగుర వేసి ... కేబినెట్‌లో మంత్రి పదవి చేపట్టారు. ఆ తరువాత 1984లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుంచి కెంబూరి రామ్మోహనరావు గెలిచారు. 1989లో టంకాల సరస్వతమ్మ, 1994, 99లో గద్దే బాబూరావులు అదే పార్టీ నుంచి ఎన్నికయ్యారు. ఆ తరువాత 2004, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున బొత్స సత్యనారాయణ గెలిచారు. తిరిగి 2014లో జరిగిన ఎన్నికల్లో ఇక్కడి ఓటర్లు తెలుగుదేశం పార్టీ తరఫున బరిలో దిగిన కిమిడి మృణాళినిని గెలిపించి, తెలుగుదేశం పార్టీపై తమకున్న అభిమానాన్ని మరోమారు చాటుకున్నారు. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మూడో సారి బొత్స సత్యనారాయణ గెలుపొందారు.


ఉత్తరాంధ్రుల ఇలవేల్పు కనక మహాలక్ష్మి అమ్మవారు..


చీపురుపల్లి పట్టణ శివారులో అమ్మవారి ఆలయం

కూటమి కోసం యాత్ర

- నాగార్జునసాగర్‌కు చెందిన వ్యక్తి ప్రయత్నం

రాజాం రూరల్: తెలుగుదేశం. జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ పల్నాడు జిల్లా నాగార్జున సాగర్‌కు చెందిన పత్తిపాటి నాగబాలాజీ నాగార్జున సాగర్ నుంచి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకూ ద్విచక్ర వాహనంపై యాత్రను కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా రాజాం కూటమి అభ్యర్థి కోండ్రు మురళిని శ్యాంపురంలో కలిశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కొనసాగుతున్న అరాచక పాలన పోవాలన్నారు. జగన్ అయిదేళ్ల పాలనలో రాష్ట్రం అథోగతి పాలైందన్నారు. సంక్షేమం మరుగున పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను పర్యటిస్తున్న ప్రాంతాలలో పోటీలో ఉన్న కూటమి అభ్యర్థులను గెలిపించాలని పట్టణాలు, గ్రామాలలో ప్రచారం చేస్తున్నానని నాగబాలాజీ వివరించారు.


ద్విచక్ర వాహనంపై ప్రచారం చేస్తున్న నాగబాలాజీ

సిరా చరిత్ర తెలుసా?

- ఎన్నికల్లో ఇదే ముఖ్యం
- ఎడమచేతి చూపుడు వేలి గోరుపై వేస్తారు
- ఇది ఉంటే ఓటు హక్కును వినియోగించుకున్నట్లే..

(విజయనగరం రూరల్)

ఓటు వేశారా? అంటే నోటితో సమాధానం చెప్పనవసరం లేదు. నేరేడు రంగులో ఉన్న సిరా గుర్తున్న వేలుని చూపిస్తే చాలు. సిరా చుక్కకు, ఓటుకు ఉన్న సంబంధం అటు వంటిది. ఈ సిరా వేస్తేనే ఓటు హక్కు వినియోగించుకున్నట్లు గుర్తింపు ఉంటుంది. ఓటు వేసిన పౌరులకు ఆ సిరా ఎక్కడ తయారవుతోందోనన్న సందేహాలు ఉంటాయి.

మైసూర్‌లో పరిశ్రమ..

కర్ణాటకలోని మైసూర్‌లో గల రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని రంగులు వార్నీష్ పరిశ్రమ ఎన్నికల సమయంలో చేతి వేలికి వినియోగించే సిరాను తయారుచేస్తోంది. దేశంలోని అన్నిరాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో జరిగే అసెంబ్లీ, లోక్‌సభ, స్థానిక సంస్థల ఎన్నికలకు ఇక్కడి నుంచే సిరా సరఫరా అవుతోంది. 1962 సార్వత్రిక ఎన్నికల నుంచి మైసూర్ పెయింట్స్ వార్నీస్ కర్మాగారం ఉత్పత్తి చేస్తున్న చెరిగిపోని సిరానే వినియోగిస్తున్నారు. ఈసారి కూడా అక్కడి నుంచే సిరాను సరఫరా చేయనున్నారు.

తొలుత లక్క.. ఆ తర్వాత పెయింట్లు

1937లో అప్పటి మైసూర్ మహారాజు నాల్మడి కృష్ణరాజు వడయార్ ఈ సిరా తయారీ కర్మాగారాన్ని స్థాపించారు. అప్పట్లో దీని పేరు మైసూర్ లాక్ అండ్ పెయింట్స్ వర్క్స్‌గా ఉండేది. 1989లో దీని పేరును మైసూర్ పెయింట్స్ అండ్ వార్నీస్ సంస్థగా మార్చారు. స్వాతంత్ర్యానికి ముందు వరకు మైసూర్ రాజుల స్వాధీనంలో ఉండేది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం చేతుల్లోకి వెళ్లిపోయింది. ఇక్కడ తొలుత సీళ్ల వేసుందుకు కావాల్సిన లక్క తయారీకి ఈ పరిశ్రమను స్థాపించారు. చెట్ల నుంచి వచ్చే జిగురు తీసుకొచ్చి దానికి ఇతర అటవీ ఉత్పత్తులను కలిపి లక్కగా మార్చి రాజముద్రను వేసేందుకు మైసూరు రాజులు ఉపయోగించేవారు. జిగురు సరఫరా తగ్గిపోవడంతో లక్కకు బదులుగా చెట్ల పసరు ఆధారంగా పెయింట్ల తయారీని ప్రారంభించారు. 1962లో ఒక ఓటరు పలుమార్లు ఓటు వేయకుండా నిరోధించేందుకు చెరిగిపోని సిరాను ఉత్పత్తి చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో నేషనల్ ఫిజికల్ లాబోరేటరీస్ ఫార్ములాతో సిరా ఉత్పత్తి బాధ్యతను ఈ కర్మాగారానికి అప్పగించారు.

మొదట్లో ఓటేసిన వ్యక్తికి ఎడమచేతి చూపుడు వేలిపై సిరా చుక్కను పెట్టేవారు. 2006 ఫిబ్రవరి నుంచి

ఎందుకు చెరగదంటే..

ఓటర్ల ఎడమ చేతి వేలి గోరుపై సిరాను గీతగా పెడుతున్నారు. సిరాలో 7.25 శాతం సిల్వర్ నైట్రేట్ ఉన్నందున వెంటనే చెరిగిపోదు. ఈ సిరా నేరేడు పండు రంగులో ఉంటుంది.



'ఘాటు' రోడ్డు!

నేతలూ చూడండి

గుమ్మలక్ష్మీపురం: కేదారిపురం నుంచి వంగర గ్రామానికి వెళ్లే ఘాట్ రోడ్డుపై పట్టపగలే చుక్కలు కనిపిస్తాయి. ఈ రహదారికి మరమ్మతులు చేయాలని బంగార కేసర, కీసరగూడ, డోలుకొన గ్రామస్తులు కోరుతున్నారు. గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు ఈ రహదారిలో కొంతభాగం దెబ్బతింది. ఈ కారణంగా వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. ఆ తర్వాత ఓ ప్రాంతంలో కూరుకుపోయిన రహదారిని మరమ్మతులు చేసి రిటైనింగ్ వాల్ నిర్మించారని... మట్టి ఫిల్లింగ్ చేసి సిమెంట్ రోడ్డు వేశారని స్థానికులు చెబుతున్నారు. మట్టి కుంగిపోయి... సిమెంట్ రోడ్డు పగిలిపోయిందని... దీనికి వెంటనే మరమ్మతులు చేయాలని వీరు కోరుతున్నారు. పార్వతీపురం నుంచి కీసరవెల్లికి ఆర్టీసీ బస్సు ఈ రహదారిపై నుంచి వెళ్తుందని స్థానికులు తెలిపారు. రోడ్డు మరమ్మతులకు గురవడంతో బస్సు నడపడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఈ రహదారిని చూసినా...మెరుగుపరిచే ఆలోచన చేయలేదని ఈ ప్రాంత గిరిజనులు ఆరోపిస్తున్నారు. అధికారులు...నాయకులు స్పందించి ఈ రహదారికి మరమ్మతులు చేయాలని వారంతా విజ్ఞప్తి చేస్తున్నారు.


పగిలిన సిమెంట్ రహదారి

పెద్దగెడ్డకు మోక్షమెప్పుడు?

నెరవేరని హామీ

పాచిపెంట: పెద్దగెడ్డ ప్రాజెక్టు ఎడమ కాలువ నిర్మాణం ఎప్పుడు జరుగుతుందోనని రైతులు ఎన్నో ఏళ్లుగా... ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు. ఎడమ కాలువ నిర్మిస్తే పద్మాపురం, పెద్దవలస ఈతమానువలస, బొబ్బిలివలస, సీతంపేట, తదితర గ్రామాలకు చెందిన సుమారు 4 వేల ఎకరాలకు సాగునీరందుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. దీని కోసం అనేకసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పించారు. గత ఎన్నికల సమయంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని ఎమ్మెల్యే రాజన్నదొర హామీ ఇచ్చారు. కానీ ఇంతవరకు ఎడమ కాలువ నిర్మించలేదు.


పెద్దగెడ్డ ప్రాజెక్టు స్పిల్‌వే

మద్యం సీసాలు స్వాధీనం

● ఇసుక ట్రాక్టర్ సీజ్

రాజాం/రూరల్: ఎస్ఈబీ సీఐ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన దాడుల్లో 48 మద్యం సీసాలు స్వాధీనం చేసుకోవడంతో పాటు అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్టు ఎస్ఈబీ సీఐ బి శ్రీధర్ తెలిపారు. శుక్రవారం వెకువ జామున రేగిడి నుంచి వస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి రాజాం పోలీసులకు అప్పగించడం జరిగిందని శుక్రవారం ఉదయం నిర్వహించిన దాడుల్లో కంచరాం గ్రామానికి చెందిన రౌతు పోలినాయుడు రాజాం నుంచి తీసుకు వెళ్తుండగా మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని రౌతు అప్పలనాయుడుపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఈబి ఎస్ఐ చంద్రశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఆరుగురిపై బైండోవర్ కేసు

బొండపల్లి: అక్రమంగా మద్యం విక్రయిస్తూ పలుమార్లు పట్టుబడిన వారిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని తహసీల్దార్ ఎస్.హనుమంతరావు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎస్ఈబీ ఎస్ఐ ఆర్.రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పలుమార్లు మద్యం అక్రమంగా విక్రయిస్తున్న మండలంలోని బొండపల్లి, బిల్లలవలస, గరుడుబిల్లి, అయ్యన్న అగ్రహారంతో పాటు పలు గ్రామాలకు చెందిన ఆరుగురు వ్యక్తులపై సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బైండోర్ కేసులు నమోదు చేశామని చెప్పారు. వీరిపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు. ఏఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

విజయనగరం క్రైం: జిల్లాలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందాలతోపాటు సెబ్, లోకల్ పోలీసుస్టేషన్‌ల అధికారులు, సిబ్బంది ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. మద్యం, నాటుసారా, గంజాయి ఉచితాల అక్రమ రవాణా నియంత్రణకు ఉమ్మడిగా తనిఖీలు చేపట్టారు. శనివారం 14 కేసులు నమోదు చేసి 13 మందిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా 74 లీటర్లు మద్యం స్వాధీనం చేసుకున్నారు. అలాగే 800 లీటర్లు సారాని ధ్వంసం చేశారు. ఈ దాడులు ఇకపై ముమ్మరం చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. అలాగే నగర శివార్లలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి చెక్‌పోస్టుల్లో ఫ్లైయింగ్ స్క్వాడ్‌తో పాటు, పోలీసు సిబ్బంది ప్రతి వాహనాన్ని పరిశీలిస్తున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలతో అధికారులు, సిబ్బంది అప్రమత్తమౌతున్నారు.

ఎన్నికల రోజున సెలవు ప్రకటించాలి

రాజాం: కార్మిక శాఖ కమిషనర్ శేషగిరిబాబు ఆదేశాల ప్రకారం పోలింగ్ జరగనున్న మే 13న ఓటుహక్కును వినియోగించుకునేందుకు వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటించాలని రాజాం సహ కార్మిక శాఖ అధికారి బి కొండలరావు ఒక ప్రకటనలో తెలిపారు. దుకాణాలు, సంస్థల చట్టం ప్రకారం ఉద్యోగులు, పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు సెలవు ఇచ్చినందుకు వేతనంలో ఎటువంటి తగ్గింపు ఉండకూడదని, ఈ నిబంధనలు ఉల్లంగిస్తే యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఫారం12కు 4,613 మంది గుర్తింపు

బొండపల్లి: గజపతినగరం నియోజకవర్గంలోని నాలుగు మండలాలైన బొండపల్లి, గజపతినగరం, దత్తిరాజేరు, గంట్యాడ మండలాలతోపాటు జామి మండలంలోని 13 పంచాయతీల పరిధిలో ఫారం-12 ద్వారా ఇంటి వద్దనే సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓటుహక్కు వినియోగించుకునేందుకుగానూ 4613 మంది ఉన్నట్లుగా గుర్తించామని తహసీల్దార్ ఎస్.హనుమంతరావు తెలిపారు. నియోజకవర్గం వ్యాప్తంగా 85 సంవత్సరాలు దాటిన వృద్ధులు 886 మంది, దివ్యాంగులు 3727 మంది నడవలేని స్థితిలో ఉన్నట్లుగా గుర్తించామని చెప్పారు. దీనికి ప్రత్యేకాధికారిగా డీటీ హరిని నియమించామని తెలిపారు.

నేడు తాగునీటి సరఫరా బంద్

బొబ్బిలి: బొబ్బిలి మున్సిపాలిటీకి సంబంధించి భోజరాజపురం ప్రధాన నీటిసరఫరా కేంద్రంలో 250 కేవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పాడవడంతో ఆదివారం పట్టణంలో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతున్నట్లు మున్సిపల్ కమీషనరు లాలం రామలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు పూర్తయిన వెంటనే తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తామని, ప్రజలంతా సహకరించాలని ఆమె కోరారు.

సొంతభవనం ఎప్పటికో?

● 60 ఏళ్లయినా అద్దె భవనాల్లోనే గ్రంథాలయం ● జనసేన నేత దీక్ష చేసినా ఫలితం శూన్యం

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో సుమారు 60 సంవత్సరాల చరిత్ర కలిగిన ప్రభుత్వ గ్రంథాలయానికి సొంత భవనం లేదు. ఎంతోమంది పాఠకులు, ఇతర సామాజిక సంస్థల ప్రతినిధులు గగ్గోలు పెడితే మున్సిపాలిటీకి చెందిన పాడుబడ్డ పాఠశాల భవనాన్ని తాత్కాలికంగా గ్రంథాలయం నిర్వహణ కోసం ఇచ్చారు. ఆ భవనం చాలా అధ్వానంగా తయారవడంతో మరమ్మతుల పేరుతో అక్కడి నుంచి కూడా గ్రంథాలయాన్ని తరిమేశారు. గ్రంథాలయంలో వసతులు, ఇతర అభివృద్ధి పనుల కోసం జనసేన యువనేత పాలూరు బాబు నిరాహార దీక్ష చేపట్టిన సంగతి తెలిసిందే. దీనిపై మున్సిపల్ పాలకవర్గం, అధికారులు స్పందించి వారంరోజుల్లో గ్రంథాలయం భవనానికి మరమ్మతులు చేపట్టి అప్పగిస్తామని హామీ ఇచ్చారు. ఇలా హామీ గుప్పించి మూడు నెలలు దాటుతున్నా ఇంతవరకు దానికి అతీగతీ లేకుండా పోయింది.

బేబీనాయన హామీ

● టీడీపీ నేత బేబీనాయన గ్రంథాలయానికి అవసరమైన పలు పుస్తకాలను ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ చిరంజీవిరావు సూచనలతో అందజేశారు. రోటరీక్లబ్ ప్రతినిధులు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నేత రౌతు రామ్మూర్తి, వార్డు కౌన్సిలరు రేజేటి కృష్ణవేణి కుమారుడు విస్సు తదితరులు గ్రంథాలయానికి ఇతోధికంగా సహాయం అందిస్తున్నారు. ప్రభుత్వ పరంగా, మున్సిపాలిటీ పరంగా చేయూతను అందించేందుకు నిర్లక్ష్యం చూపుతుండడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైతే గ్రంథాలయానికి అన్ని రకాల హంగులు సమకూర్చుతానని, ప్రభుత్వ పరంగానే కాకుండా సొంత నిధులతో కూడా యువతకు సహకారం అందిస్తానని బేబీనాయన అన్ని హామీ ఇస్తున్నారంటే గ్రంథాలయం సమస్య తీవ్రత ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు.

దీనితో వేరే గత్యంతరం లేక పట్టణంలో కోరాడవీధిలో శ్మశానవాటిక సమీపంలోని ఓ ప్రైవేట్ భవనంలో గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్నారు. సరైన రహదారి సౌకర్యం లేని ఈ ఊరి చివర గ్రంథాలయంలోనే చదువుకుంటూ సుమారు పాతిక మంది యువకులు ఇటీవల గ్రూపు-2 ప్రిలిమ్స్‌లో అర్హత సాధించారు. అధునాతన వసతులతో గ్రంథాలయాన్ని తీర్చిదిద్దితే ఇంకా అనేక మంది నిరుపేద యువకులు పోటీ పరీక్షల్లో రాణించగలరని ఎంపికైన యువకులు చెబుతున్నారు.



మూడునెలలుగా ఓ అద్దెభవనంలో నడుస్తున్న గ్రంథాలయం ఇదే..



శిథిలావస్థకు చేరుకోవడంతో ఖాళీ చేయించిన తాత్కాలిక గ్రంథాలయ భవనం

కాళ్లరిగేలా తిరిగి అలసిపోయా..

గ్రంథాలయం భవనం కోసం అందరి దగ్గరికి కాళ్లరిగేలా తిరిగాను. వేరే అవకాశం లేకపోవడంతో ఊరి చివర ఉన్న ప్రైవేట్ భవనంలో తలదాచుకునేందుకు రావాల్సి వచ్చింది. ఇక్కడ ఎలుకల బెడద ఎక్కువగా ఉండడంతో దాతలు, ప్రభుత్వం ఇచ్చిన పుస్తకాలను కాపాడుకోవడం చాలా కష్టంగా ఉంది. యువకులు ఇక్కడ చదువుకుని రాణిస్తుండడంతో ఎంతో ఆనందం కలుగుతోంది. పోటీ పరీక్షలకు హాజరయ్యే యువత భవిష్యత్ కోసం పెద్దలంతా పెద్ద మనసు చేసుకుని గ్రంథాలయాన్ని అభివృద్ధి చేయాలి.

- స్వర్ణకుమారి, లైబ్రేరియన్, బొబ్బిలి

వేడుకగా చంద్రబాబు జన్మదినం

చంద్రబాబు పుట్టినరోజును పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా టీడీపీ నాయకులు వేడుకలు నిర్వహించారు. మండల కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాల్లోనూ స్థానిక నాయకులు, ఎమ్మెల్యే అభ్యర్థులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.



గరివిడి: కేక్ తినిపిస్తున్న కళా వెంకటరావు



రాజాం రూరల్: కేకు కట్ చేస్తున్న కోండ్రు



విజయనగరం: కేక్ కట్ చేస్తున్న అదితి



ఎల్.కోట: కేక్ కట్ చేస్తున్న కోళ్ల



భోగాపురం: కేక్ కట్ చేస్తున్న బంగార్రాజు, కలిశెట్టి

సచివాలయ సిబ్బంది వివాద ఘటనపై విచారణ



దర్యాప్తు చేస్తున్న ఈవోపీఆర్డీ

రేగిడి: మునకలవలస గ్రామ సచివాలయంలో వేతన బిల్లుల విషయమై డిజిటల్ అసిస్టెంట్ సత్యనారాయణ, సెక్రటరి సుధీర్ మధ్య శుక్రవారం జరిగిన వివాదం ఫిర్యాదుల వరకూ వెళ్లిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ చేసి నివేదికలు అందించాలని ఈవోపీఆర్డీ సత్యనారాయణకు ఎంపీడీవో శ్యామలాకుమారి ఆదేశించారు. దీంతో ఈవోపీఆర్డీ శనివారం మునకలివలస గ్రామ సచివాలయానికి చేరుకుని విచారణ చేపట్టారు. జిల్లా ఆర్వో ఆదేశాలమేరకు ఆర్ఐ రేవతి సైతం విచారణ నిర్వహించారు. ముందుగా వివాదానికి గల కారణాలపై మాట్లాడారు. వేతన బిల్లుల విషయంలో గొడవలు వచ్చినట్లు గుర్తించి ఆయన సహా సిబ్బందిని పూర్తిస్థాయిలో విచారించారు. వివాదానికి గల కారణాలు, గొడవపడిన వారితో పూర్తిగా విచారించిన అనంతరం ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఈవోపీఆర్డీ, ఆర్ఐ రేవతి తెలిపారు.

ఉత్సాహంగా పనిచేయండి: అదితి

విజయనగరం రూరల్: తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పనిచేసి, రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేయాలని అదితి గజపతిరాజు పిలుపునిచ్చారు. శనివారం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రభుత్వ నిరంకుశ వైఖరితో పాటు, చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను ఇంటింటికి వెళ్లి వివరించాలన్నారు. ● విజయ నగరంలోని తొమ్మిదో డివిజన్ పరిధిలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పేరి రామయ్య పంతులు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదితి గజపతి

మెట్టవలసలో టీడీపీలో చేరికలు

బొబ్బిలి: బొబ్బిలి మండలం మెట్టవలస గ్రామానికి చెందిన 20 కుటుంబాల వారు శనివారం బొబ్బిలి కోటకు వచ్చి బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. మెట్టవలస సర్పంచ్ పువ్వల మాధవరావు, మాజీ సర్పంచ్ కెల్ల సత్యనారాయణ (తౌడు), పువ్వల వెంకటరమణ (శాస్త్రి), కోట తిరుపతి, పువ్వల సత్యారావుల ప్రోద్బలంతో వారంతా వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి బేబీనాయన, తెంటులు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.



పార్టీలో చేరినవారితో బేబీనాయన

కూటమి గెలిస్తేనే రాష్ట్రాభివృద్ధి

కొత్తవలస: తెలుగుదేశంపార్టీ అధికార ప్రతినిధి కోళ్ల వెంకటరమణ, మండల టీడీపీ అధ్యక్షుడు గొరపల్లి రాము శనివారం మండలంలోని చినరావుపల్లి, పెదరావుపల్లి, గొల్లపేట, కాటకాపల్లి గ్రామాలలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ● **లక్కవరపుకోట:** అలమండ, గొడుకొమ్ము, ధర్మవరం, వేములాపల్లి గ్రామాల నుంచి 80 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరాయి.

కూటమితోనే అభివృద్ధి: హైపర్ ఆది

భోగాపురం: కూటమితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని బుల్లితెర నటుడు హైపర్ ఆది అన్నారు. రావాడ గ్రామంలో శనివారం నిర్వహించిన ప్రచారంలో ఆయన నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి లోకం నాగమాధవితో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో నాగమాధవి మాట్లాడుతూ చంద్రబాబును మోదీని కలిపిన గొప్ప వ్యక్తి పవన్ కల్యాణ్ అన్నారు. గ్లాజు గుర్తుపై ఓటేసి కూటమిని గెలిపించాలని కోరారు. టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ అభివృద్ధి కోసం చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో కాకర్లపూడి శ్రీనివాసరాజు, చిన్నంనాయుడు, సూర్యనారాయణ మూర్తిరాజు, మైలపల్లి నరిశమ్మ, చెల్లుబోయిన నరిశింగరావు, మట్టా అయ్యప్పరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హైపర్ ఆది

దండుమారమ్మ కోవెలలో ఎస్పీ

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దండుమారమ్మ కోవెల వద్ద అన్నసమారాధన కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ దీపిక ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాధువులకు, భిక్షులకు భోజనాలు వడ్డించారు. ఏఆర్ డీఎస్పీ యానివర్స్, ఆర్ ఎస్సైలు గోపాలనాయుడు, రమేష్, కమిటీ సభ్యులు తాతరాజు, రవీశ్వరడు, వాసు, లక్ష్మణ్, బలరాం తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో ఎస్పీ పూజలు

విధులకు మిమ్స్ ఉద్యోగులు

నెల్లిమర్ల: గత 80 రోజులుగా సమ్మెలో ఉన్న మిమ్స్ వైద్య కళాశాల ఉద్యోగులు శనివారం విధుల్లో చేరారు. పలు సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ వారంతా ఫిబ్రవరి 1వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్లారు. ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చొరవతో ఉద్యోగులకు, మిమ్స్ యాజమాన్య ప్రతినిధులకు ఒప్పందం జరగడంతో సమ్మె విరమించి శనివారం విధులకు హాజరయ్యారు.

కళాశాలలో పిల్లలను చేర్పించండి

శృంగవరపుకోట రూరల్: ధర్మవరం ప్రభుత్వ బాలికల కళాశాలలో ఇటీవల పదిపరీక్షలు రాసిన అమ్మాయిలను చేర్పించాలని కోరుతూ ఈ కళాశాల అధ్యాపకులు ఇటీవల పది పరీక్షలు రాసిన విద్యార్థినుల తల్లిదండ్రులను కలిసి వారిని తమ కళాశాలలో చేర్పించాలని కోరారు. తమ కళాశాలలో ఉన్న ప్రత్యేకత వివరించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

రామభద్రపురం: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని బొబ్బిలి రూరల్ సీఐ ఎస్.తిరుమలరావు హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో శనివారంవిలేఖర్లతో మాట్లాడారు.

అవగాహనతోనే అగ్నిప్రమాదాల నివారణ

విజయనగరం క్రైం: అగ్నిమాపక వారోత్సవాల్లో నిర్వహిస్తున్న అవగాహన సదస్సుతోనే అగ్ని ప్రమాదాలు నివారించుకోవచ్చునని జిల్లా అగ్నిమాపక శాఖాధికారి రామ్‌ప్రకాష్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని జిల్లా కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. అగ్నిమాపక సిబ్బంది వివిధ డెమోలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రామ్‌ప్రకాష్ మాట్లాడుతూ అగ్నిప్రమాదాలపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ట్రాఫిక్ డీఎస్పీ విశ్వనాథ్ మాట్లాడుతూ ప్రమాదంజరిగిన వెంటనే నిమిషాల వ్యవధిలోనే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకోవడంతో ఎటువంటి నష్టం జరగడం లేదన్నారు. జిల్లా అగ్నిమాపక శాఖ సహాయ అధికారి సోమేశ్వరరావు, ఫారెస్టు రేంజర్ అప్పలరాజుతోపాటు వివిధ సంస్థల యాజమాన్యాలు, విద్యార్థులు పాల్గొన్నారు. ● **గజపతినగరం:** అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగిఉంటే ప్రమాదాల నియంత్రణ చేపట్టవచ్చునని అగ్నిమాపక కేంద్రాధికారి ఎంఎస్‌వీ రవిప్రసాద్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం స్థానిక అగ్నిమాపక కేంద్ర కార్యాలయంలో వ్యాపారులు, విద్యార్థులు, అంగన్‌వాడీ సిబ్బందికి అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ● **కొత్తవలస:** వారం రోజుల పాటు నిర్వహించిన అగ్నిమాపక వారోత్సవాలు శనివారంతో ముగిసాయి. ఈ నెల 14 వతేది నుంచి శనివారం వరకు కొత్తవలస అగ్నిమాపక కేంద్రం పరిధిలో గల వివిధ ప్రాంతాలలో వివిధ రకాల అగ్ని ప్రమాదాల విషయమై అగ్నిమాపక అధికారి వై.అశోక్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం ముగింపు సందర్భంగా వివిధ ప్రాంతాలలో అగ్నిప్రమాదాల నివారణకు సంబంధించి కరపత్రాలను పంపిణీ చేశారు.

యువకుడి ఆత్మహత్య



ఈశ్వరరావు (ఫైల్)

మెంటాడ, ఏప్రిల్ 20: యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ఆంద్ర ఎస్ఐ దేవి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెదమేడపల్లి గ్రామానికి చెందిన కిల్లాడ ఈశ్వరరావు (30) మండలంలో ఒక బ్యాంకుకు సంబంధించిన కస్టమర్ సర్వీస్ పాయింట్(సీఎస్పీ) ను నిర్వహించేవాడు. అయితే కొద్ది కాలంగా ఆ విధులకు దూరంగా ఉన్న ఈశ్వరరావు శుక్రవారం పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఈశ్వర రావును గుర్తించిన స్థానికులు, కుటుంబ సభ్యులు విజయనగరం సర్వజన ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. తమ కుమారుడి ఆత్మహత్యకు ఆర్థిక సమస్యలే కారణమని తల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ దేవి తెలిపారు. ఇలా ఉండగా ఈశ్వరరావు మృతిపై స్థానికంగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సీఎస్పీ నిర్వహిస్తున్న ఈశ్వరరావు కొద్దికాలంగా నిధుల దుర్వినియోగం ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో విధులకు దూరంగా ఉంటున్నాడు. నిధుల విషయంలో తనపై రకరకాలుగా జరుగుతున్న ప్రచారంతో కలతచెంది ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని స్థానికుల నుంచి అభిప్రాయం వ్యక్తమవుతోంది.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి



అప్పలనాయుడు (ఫైల్)

రేగిడి: విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఏఎస్ఐ రాజారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాలకొండ మండలం అంపిలికి చెందిన అలుబిల్లి అప్పలనాయుడు(58) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతను సమీప గ్రామమైన బొడ్డవలసలో ఉన్న సొంత పొలంలో చెరుకు సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం పంటకు నీరు కట్టేందుకు వచ్చి మోటార్ వేయ డానికి ప్రయత్నిస్తుండగా కింద ఉంద ఉన్న కరెంట్ వైరును గుర్తించక అడుగు వేయడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెనుక నుంచి గమనించిన కుమారుడు శంకరరావు గట్టిగా కేకలు వేయడంతో దగ్గరలో ఉన్నవారంతా వచ్చి రక్షించే ప్రయత్నం చేయగా అప్పటికే అప్పలనాయుడు మృతి చెందాడు. మృతుడికి భార్య నాగమని, కొడుకు శంకరరావు, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని రాజాం ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రాజారావు తెలిపారు.

భర్తను హత్య చేసిన భార్య



అప్పన్న (ఫైల్)

గరివిడి: మండలంలోని వెదుళ్లవలస గ్రామానికి చెందిన కొలుసు అప్పన్న(19) అనే వ్యక్తిని ఆయన భార్య దేవి తన తల్లి దండ్రులైన సన్యాసిరావు, ఎల్లమ్మ సహకారంతో శుక్రవారం అర్ధరాత్రి హత్య చేసింది. ముందుగా అప్పన్న తలపై బండరాయితో కొట్టి తర్వాత మెడకు చున్నీతో ఉరివేసి వేలాడ దీశారు. గత కొంతకాలంగా అప్పన్న, దేవిల మధ్య తరుచూ గొడవలు జరుగుతూ ఉన్నారు. ఈనేపథ్యంలో అప్పన్నను పథకం ప్రకారం ముగ్గురూ కలిసి హత్య చేశారు. వీరికి సుమారు రెండేళ్ల పాప, నాలుగు నెలల బాబు ఉన్నారు. విషయం తెలుసుకున్న చీపురుపల్లి సీఐ సీహెచ్ షణ్ముఖరావు, గరివిడి ఎస్ఐ ఎల్.దామోదరరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

రాజాం రూరల్: స్థానిక శ్రీకాకుళం రోడ్‌లో ఈనెల 18న రాత్రి ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో వెస్ట్ బెంగాల్‌కు చెందిన విక్రం తలకు తీవ్ర గాయమైనట్టు ఏఎస్.ఐ. భాస్కర్రావు తెలిపారు. శ్రీకాకుళం రోడ్‌లో ఓ షాపులో పనిచేస్తున్న విక్రం విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించిందని ఆయన తెలిపారు. విక్రం పనిచేస్తున్న షాపు మేనేజర్ అన్నెపు సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్.ఐ. భాస్కర్రావు తెలిపారు.

వ్యక్తికి జైలు శిక్ష

విజయగనరం క్రైం: మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ సీఐ వెంకట్రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గంట్యాడ మండలం పెంట శ్రీరామ్‌పురం గ్రామానికి చెందిన గంధవరపు గోపి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ఓ మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించి పరారయ్యాడు. బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. ఈ కేసును ఎస్సై నరేష్‌కుమార్ దర్యాప్తు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.